క్లుప్తంగా

బాల్య వివాహాలు అనర్థదాయకం


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అమరాపురం: బాల్య వివాహాలు అనర్థదాయకమని ఆర్డీటీ ఏటీఎల్ సావిత్రి పేర్కొన్నారు. శుక్రవారం ఆర్డీటీ ఆధ్వర్యంలో కళాకారులు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల, ఆర్టీసీ బస్టాండు వద్ద అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. తల్లిదండ్రులు అమ్మాయిలకు 18 సంవత్సరాలు నిండిన తరువాత వివాహాలు చేయాలని ప్రభుత్వం చేసిన చట్టాల గురించి తెలియజేశారు. బాల్య వివాహాలు చట్టారీత్యా నేరమన్నారు. ఎవరైనా అలా చేస్తే వెంటనే ఐసీడీఎస్ లేదా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆర్డీటీ కల్చరల్ ఎస్టీఎల్ తెప్పమయ్య, కోఆర్డినేటర్ శ్యామ్‌సమ్ పరంజ్యోతి, సీఓ చంద్ర కళాకారుల బృందం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదవాలి


వర్కు బుక్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ భాస్కర్

అగళి: విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలని ఎంఈఓ భాస్కర్ సూచించారు. శుక్రవారం ఆయన ఇనగలూరు ప్రాథమి కోన్నత పాఠశాల, కరిదసనపల్లి ప్రాథమి పాఠశాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని నిర్వాహకులను ఆదేశించారు.

ప్రమాదాల నివారణకు సహకరించాలి


ఈద్గా ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎస్‌ఐ నాగస్వామి

రొద్దం: మండల కేంద్రంలోని పావగడ–పెనుకొండ ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ఈద్గాకు రక్షణగా పాతిన బండలను తొలిగించి, ప్రహరీ నిర్మించుకోవాలని ఎస్‌ఐ నాగస్వామి ముస్లింలను కోరారు. ఈద్గా వద్ద మలుపు ఉండటంతో రోడ్డు ప్రమాదాలు జరిగి ఇప్పటికే పలువురు మృతి చెందారన్నారు. స్పందించిన ముస్లింలు శుక్రవారం బండలు తొలగించి ప్రహరీ నిర్మాణానికి ఒప్పుకున్నారు. అనంతరం ఎస్‌ఐ నాగస్వామి చేతులమీదుగా ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ చేశారు. మలుపులో రోడ్డు ప్రమాదాల నివారణకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.

పాఠశాలలో టీవీ అపహరణ

అమరాపురం: నిడ్రగట్ట ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం రాత్రి టీవీ చోరీకి గురైనట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం రామచంద్రరావు తెలిపారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఎంఈఓలు రాఘవయ్య, వెంకటరమణనాయక్‌కు సమాచారం అందించామన్నారు.

జిల్లాస్థాయి ఫుట్‌బాల్ జట్టుకు ఎంపిక


ఆదిత్య


కీర్తి చరణ్

మడకశిరరూరల్: పట్టణానికి చెందిన ఫుట్‌బాల్ క్రీడకారులు ఆదిత్య, కీర్తి చరణ్ శ్రీసత్యసాయి జిల్లా సబ్ జూనియర్ అండర్–19 బాలుర జట్టుకు ఎంపికై నట్లు శుక్రవారం ఫుట్‌బాల్ క్లబ్ నిర్వాహకులు తెలిపారు. హిందూపురంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీల ఎంపికలో వీరు మంచి ప్రతిభ కనపరిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారన్నారు. వీరు ఆర్డీటీ అకాడమీలో శిక్షణ తీసుకుంటున్నారని క్లబ్ సభ్యులు నవీద్, మోహన్, రవిశంకర్, నాగభూషణం, బాలాజీ తెలిపారు.

పిల్లలతో కలసి తల్లి అదృశ్యం


ఇద్దరు పిల్లలతో వడ్డి శైలజా దేవి (ఫైల్)

పెనుకొండ రూరల్: ఇద్దరు పిల్లలతో కలసి ఓ మహిళ గురువారం అదృశ్యం అయింది. వివరాలు.. మునిమడుగు గ్రామానికి చెందిన వడ్డి శైలజా దేవి భర్త రవితో గురువారం ఉదయం గొడవపడింది. తన పిల్లలు జయకృష్ణ, వియాన్‌తేజతో కలసి హిందూపురం మండలంలోని ఎం.బీరేపల్లికి వెళ్తున్నట్లు భర్తకు చెప్పి ఆటోలో బయలు దేరింది. అయితే శుక్రవారం కూడా పుట్టినింటికి చేరలేదు. కుటుంబ సభ్యులు, బంధువులను విచారించినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం సాయంత్రం వడ్డి శైలజా దేవి అదృశ్యమైనట్లు తండ్రి శ్రీరాములు కియా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ హుస్సేన్ తెలిపారు.

పుడమి తల్లిని కాపాడుకుందాం

- ఎమ్మెల్యేలు డాక్టర్ తిప్పేస్వామి, శంకరనారాయణ


మట్టి దీపాలు వెలిగిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి తదితరులు


నా భూమి-నా దేశం శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే శంకరనారాయణ

మడకశిరరూరల్: పుడమి తల్లిని కాపాడుకుందామని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నామట్టి– నా దేశం(నియోజకవర్గ స్థాయి) కార్యక్రమం ఘనంగా జరిగింది. గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. మొక్కలు నాటి నీరు పోశారు. మట్టి దీపాలు వెలిగించి పంచ ప్రాణ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వాతంత్ర్య స్ఫూర్తిని భావి తరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దేశ సేవకు ప్రతి ఒక్కరూ అంకితమవుదామని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా ఆరోగ్యానికి, విద్య, ప్రకృతి వ్యవసాయానికి పెద్దపీట వేశారని తెలిపారు. మానవ మనుగడ అత్యంత కీలకమైన మట్టిని రక్షించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ సరోజమ్మ, సింగిల్ విండో అధ్యక్షుడు రామిరెడ్డి, మాజీ ఎంపీపీ బజ్జప్ప, తహసీల్దార్ ముర్షావలి, ఏఓ తిమ్మప్ప, ఎంఈఓలు నరసింహమూర్తి, భాస్కర్, ఈఓఆర్డీ శైలజ, ఎంపీడీఓలు, గ్రామ కార్యదర్శులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

పెనుకొండ: ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని ఎమ్మెల్యే శంకరనారాయణ పేర్కొన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం నా భూమి–నా దేశం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జెండా ఎగురవేసి, కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యం అన్నారు. విద్యార్థులు, పర్యావరణ హితులు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. అనంతరం స్వాతంత్ర్య ఉద్యమంలో పోరాడిన దేశ నాయకులకు పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్, వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ బోయ నరసింహ, ఎంపీడీఓ శివశంకరప్ప, ఏపీఓ జయమ్మ, కౌన్సిలర్లు రామాంజినేయులు, శేషాద్రి మాజీ ఎంపీటీసీ రామ్మోహన్ రెడ్డి, అగ్రి బోర్డు చైర్మన్ కొండలరాయుడు, నాయకులు బోయ బాబు, గణేష్, యాసిన్, కృష్ణ, ఫరీద్, శ్రీరాములు కో–ఆప్షన్ మెంబర్లు నేమతుల్లా, ముహీబా తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి పెద్దపీట

రొళ్ల: రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తోందని ఎంఈఓ–2 శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం అలుపనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత, గొట్టుగుర్కి ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. ఆయా పాఠశాలలో రికార్డులు తనిఖీ చేసి విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పంట నమోదు చేయించుకోండి

గుడిబండ: మండలంలో పంటలు సాగు చేసిన రైతులు సెప్టెంబర్ 15 లోపు ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని ఏఓ వీరనరేష్ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. పంట నమోదు చేసుకోకపోతే ప్రభుత్వం నుంచి రాయితీలు వర్తించవని పేర్కొన్నారు.

ముద్ర రుణాలు ఇవ్వాలి

సోమందేపల్లి: మండల కేంద్రంలోని అర్హులైన చేనేత కార్మికులందరికీ ప్రధాన మంత్రి వీవర్స్ యోజన ద్వారా ముద్ర రుణాలు ఇవ్వాలని జాతీయ చేనేత ఐక్యవేదిక నియోజకవర్గ అధ్యక్షుడు శీల నారాయణ స్వామి డిమాండ్ చేశారు. గత ఏడాది స్థానిక కెనరా బ్యాంకు అధికారులు అర్హులను గుర్తించడం జరిగిందన్నారు. అయితే ఇప్పటి వరకు రుణాలు ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా చేనేత కార్మికులకు రుణాలు ఇవ్వాలని కోరుతూ అసిస్టెంట్ మేనేజర్ లక్ష్మణ్‌కు వినతిపత్రం అందజేశారు.

గృహ సారథులకు రూ.10 లక్షల బీమా

- ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

పెనుకొండ: మండల జేసీఎస్ కన్వీనర్ల ఆధ్వర్యంలో గృహ సారథులకు రూ.10 లక్షల ప్రమాద బీమా నమోదు చేయించాలని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సచివాలయ కన్వీనర్లకు ప్రమాద బీమా నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సెప్టెంబర్ 10వ తేదీలోపు గృహ సారథులకు రూ.10 లక్షల ప్రమాద బీమా నమోదు చేయాలని ఆదేశించారు. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేసిన కార్యకర్తలను సచివాలయ కన్వీనర్లుగా ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఎల్లవేళలా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. రెండోసారి జగన్‌ను ముఖ్యమంత్రిగా గెలిపించుకునేందుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా శ్రమించాలన్నారు. భవిష్యత్తులో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో పెనుకొండ, సోమందేపల్లి, పరిగి, గోరంట్ల, రొద్దం మండలాల నాయకులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై దృష్టి సారించండి


మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటరత్నమ్మ

లేపాక్షి: మండల వ్యాప్తంగా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎంపీపీ వెంకటరత్నమ్మ సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే కూలీలందరికీ ఉపాధి పనులు కల్పించాలన్నారు. సర్పంచ్ ఆదినారాయణ మాట్లాడుతూ ఉపాధి బిల్లులు కూలీలకు సకాలంలో అందడం లేదన్నారు. పట్టుశాఖ అధికారి శంకరనాయక్ మాట్లాడుతూ మల్బరీ రైతులు ప్రభుత్వ సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏపీఎం జయచంద్ర మాట్లాడుతూ చిన్నచిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవడానికి 30 శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించని వారితో చర్చించి సెప్టెంబర్ 15లోగా నివేదిక ఇవ్వాలని ఎంపీడీఓ నరసింహనాయుడు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాబు, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీలు అంజినరెడ్డి, నీలావతి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు

లేపాక్షి: స్థానిక వీరభద్రస్వామి దేవాలయంలో దుర్గాదేవి అమ్మవారికి శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకార్చనలు, తీర్థప్రసాద వినియోగాలు, మహామంగళారతి తదితర కార్యక్రమాలను చేపట్టారు.

పరామర్శ

లేపాక్షి: మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన ఎఫ్‌పీ షాపు డీలర్ నరేష్ కుటుంబ సభ్యులను వెస్సార్‌సీపీ నాయకులు గుడ్డంపల్లి వేణుగోపాల్‌రెడ్డి, సర్పంచ్ వసుంధర, వైస్ ఎంపీపీ నీలావతి, హిందూపురం మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి హనుమంతరెడ్డి, కౌన్సిలర్లు శివ, పార్వతి నాగరాజు, రామచంద్ర, సాధిక్ శుక్రవారం రాత్రి పరామర్శించారు. మృతుడు నరేష్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటుమన్నారు.

కరపత్రాల పంపిణీ

హిందూపురం అర్బన్: పట్టణంలోని విద్యుత్ శాఖ డీఈ కార్యాలయం వద్ద విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులకు అన్యాయం చేసిన యాజమాన్యం పవర్ జేఏసీ ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం విద్యుత్ కాంటాక్ట్ కార్మికులు కరపత్రాలు పంచారు. కాంటాక్ట్ కార్మికులంతా ఒక వేదిక పైకి వచ్చి న్యాయమైన వేతన ఒప్పందాన్ని సాధించేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి నరసింహప్ప, మల్లికార్జున, రఫీ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

సోమందేపల్లి: మండలంలోని బ్రహ్మణపల్లి గ్రామంలో శుక్రవారం కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ విజయ్ కుమార్ తెలిపారు. కురుబ బాబు, ఆదినారాయణ అనే వ్యక్తులు విక్రయానికి తీసుకెళ్తున్న 25 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పట్టుసాగుపై అవగాహన

లేపాక్షి: మండలంలోని మైదుగోళం గ్రామంలో శుక్రవారం పట్టు రైతులకు ఆ శాఖ అధికారి శంకర నాయక్ పట్టుబడి కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మల్బరీ సాగులో మెలకువలు, రేషం పురుగులు పెంపకంలో నూతన పద్ధతులు, నూతన వంగడాల వలన కలిగే ప్రయోజనాలపై రైతులకు ఆయన అవగాహన కల్పించారు. టెక్నికల్ అసిస్టెంట్ సహదేవుడు, వీఎస్‌ఏ హరిబాబు, రైతులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

మడకశిరరూరల్: పట్టణంలోని ప్రధాన సర్కిల్‌లో శుక్రవారం ఎస్‌ఐ లోకేష్ వాహనాలను తనిఖీ చేశారు. రికార్డుల లేని వాహనదారులకు జరిమానా విధించారు. రికార్డులు లేని వాహనాలను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఏపీటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

సోమందేపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో శుక్రవారం ఏపీటీఎఫ్ నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ స్టేట్ కౌన్సిలర్ నాగరాజు ఆధ్వర్యంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కిష్టప్ప, అధ్యక్షుడిగా చంద్ర, ప్రధాన కార్యదర్శిగా సంజీవరాయుడుతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు.

వృద్ధులకు కంటి పరీక్షలు

హిందూపురం టౌన్: డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 4వ వార్డు సచివాలయంలో ప్రభుత్వాస్పత్రి ఆప్తమాలజిస్ట్ డాక్టర్ సుబ్బారావు ఆధ్వర్యంలో శుక్రవారం కంటి పరీక్షలను నిర్వహించారు. సచివాలయ పరిధిలో ఉన్న వృద్ధులు శిబిరంలో పాల్గొని కంటి పరీక్షలను చేయించుకున్నారు. ఈ సందర్భంగా 30 మంది వృద్ధులకు కంటి అద్దాలు, మందులు అందజేశారు. అలాగే ముగ్గురిని శస్త్ర చికిత్సల కోసం ఎంపిక చేశారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి రూప తదితరులు పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు


హుండీలో కానుకలను లెక్కిస్తున్న అధికారులు, గ్రామ పెద్దలు

లేపాక్షి: స్థానిక వీరభద్రస్వామి దేవాలయంలో శుక్రవారం ఉదయం దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ నరసింహరాజు, ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి పర్యవేక్షణలో హుండీలో కానుకలను లెక్కించారు. 81 రోజులకుగానూ రూ.1,88,988 ఆదాయం వచ్చిందని ఈఓ తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు రామచంద్రరావు, రామాంజనేయులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

భూగర్భ జలాల పెంపునకు కృషి


15వ వార్డులో భూమిపూజ చేస్తున్న పార్టీ సమన్వయకర్త దీపిక, కౌన్సిలర్లు, నాయకులు

హిందూపురం: భూగర్భ జలాల పెంపునకు చెరువుల కట్టల బలోపేతంతోపాటు సంరక్షణ, సుందరీకరణలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక అన్నారు. ఏపీ క్లీనింగ్ అండ్ గ్రీన్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఫండ్స్ కింద మంజూరైన రూ.71 లక్షల నిధులతో సురప్పకట్ట, సూగూరు చెరువు కట్టలపై వాకింగ్ ట్రాక్‌తోపాటు, కట్టల బలపేతానికి పనులు చేపడతామన్నారు. 14, 15, 16, 17, 27వార్డుల్లో వైస్‌చైర్మన్ బలరామిరెడ్డి, కౌన్సిలర్లు షాజియా, నాగేంద్రమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం ఆమె భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతూ చెరువులను పునరుద్ధరించడంతో పాటు చెరువు కట్టలను బలపేతం చేయడానికి కేంద్రం సహకారంతో సీఎం జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. అలాగే నియోజకవర్గంలో పలు పెద్ద చెరువుల బలపేతం, సుందరీకరణ పనులు చేయడంతోపాటు అభివృద్ధి చేయడానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారంతో కృషి జరుగుతోందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శివ, రామచంద్ర, మల్లికార్జున, చంద్ర,రోషన్, మణి, కార్పోరేషన్ డైరెక్టర్లు లక్ష్మీనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు రాంమూర్తి, రవీంద్రుడు, తిమ్మారెడ్డి, లవకుమార్, జయరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలపై అవగాహన

రొళ్ల: స్థానిక రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం ఖరీఫ్ సాగు పంట కోత ప్రయోగాలు, ఈ–పంట నమోదు పై రెవెన్యూ, ఆర్‌బీకే సిబ్బందికి సహాయ గణాంకాల అధికారి మల్లికార్జున, ఏఓ రాజలక్ష్మీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్‌లో సాగు చేసిన వివరాలను ఈ–పంట ద్వారా పంటల వివరాలను ఆన్‌లైన్‌లో సర్వే నంబర్ల వారీగా అప్‌లోడ్ చేయాలన్నారు. పంటకోత ప్రయోగాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. మండల గణాంక అధికారిణి భార్గవి, రెవెన్యూ, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

ఈ–క్రాప్ బుకింగ్ తప్పనిసరి

పెనుకొండ రూరల్: ఈ–క్రాప్ బుకింగ్ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని గుట్టూరు రైతు భరోసా కేంద్రం పరిధిలో సాగు చేసిన పంటలను పలువురు అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ–క్రాప్ చేయించిన పంటలకే మద్దతు ధర, నష్టపరిహారం అందుతాయన్నారు. కార్యక్రమంలో పట్టుపరిశ్రమ శాఖ జేడీ పద్మావతి, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అవుటాల రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్‌కు సన్మానం

పెనుకొండ: విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించి, ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న సబ్ కలెక్టర్ కార్తీక్‌ను శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో పలువురు ప్రజా సంఘాల నాయకులు సన్మానించారు. మానవహక్కుల సంఘం నాయకులు రవూఫ్, హైకోర్ట్ అడ్వకేట్ రామకృష్ణ, దండోరా రాష్ట్ర నాయకులు రామాంజనేయులు, నరసింహులు, మాల మహానాడు కన్వీనర్ ఎంఎస్. మూర్తి పాల్గొన్నారు.

పంచలోహ విగ్రహాల అందజేత


శనీశ్వర స్వామి పంచలోహ విగ్రహాలు

పావగడ: శ్రావణ మాసోత్సవాలను పురస్కరించుకుని స్థానిక శనీశ్వరాలయంలో కొలువు దీరిన శనీశ్వర స్వామి, జ్యేష్ఠాదేవి పంచలోహ విగ్రహాలను ఆలయ సమితి పదాధికారులు శుక్రవారం ఆలయానికి అందజేశారు. ఆలయ సమితి అధ్యక్షుడు ఆనందరావు, కార్యదర్శి సుబ్బనరసింహ, మాజీ అధ్యక్షుడు కేవి శ్రీనివాస్ ఉన్నారు.

కారు బోల్తా

సోమందేపల్లి: మండలంలోని పాపిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం ఓ కారు బోల్తా పడిన సంఘటన చోటు చేసుకుంది. అనంతపురం వైపు నుంచి బెంగళూరు వైపు వెళ్తున్న కారు అదుపుతప్పి రోడ్డు మధ్యలో బోల్తా పడింది. అయితే డ్రైవర్ సురక్షితంగా బయటపడినట్లు పోలీసులు తెలిపారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో హైవే సిబ్బంది, పోలీసులు అక్కడికి చేరుకుని కారును స్టేషన్‌కు తరలించారు.

రిమాండ్‌కు సచివాలయ ఉద్యోగి

పెనుకొండ రూరల్: మండలంలోని మరువపల్లి గ్రామానికి చెందిన అఖిల గత నెలలో సచివాలయ ఉద్యోగి గోవర్దన్ ప్రేమ పేరుతో మోసం చేశాడంటూ ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఇదే గ్రామానికి చెందిన సచివాలయ ఉద్యోగి గోవర్ధన్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు శుక్రవారం విచారించారు. అనంతరం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ కరుణాకర్ తెలిపారు.

ఉప ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి


హిందూపురం: చలివెందులలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

అమరాపురం: నిడ్రగట్ట గ్రామ పంచాయతీ 4వ వార్డు సభ్యుని ఎన్నిక కోసం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రిటర్నింగ్ అధికారి భాస్కర్ తెలిపారు. స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ పోలింగ్, మధ్యాహ్నం 2 గంటలకు కౌంటింగ్ ఉంటుందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఉప ఎన్నికలకు బందోబస్తు

సోమందేపల్లి: మండలంలోని బ్రహ్మసముద్రం గ్రామంలో 2వ వార్డు సభ్యుడి ఉప ఎన్నికలకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ విజయ్ కుమార్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు 18వ వార్డుకు ఉప ఎన్నికలు

గోరంట్ల: గోరంట్ల మేజర్ పంచాయతీ పరిధిలోని 18వ వార్డు సభ్యుడి ఎన్నికకు శనివారం పోలింగ్ జరగనుంది. ఇందుకు సంబంధించి ఇప్పటికే అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థానిక ఎమ్మార్సీ ప్రాంగణంలోని పాథమిక పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల నిర్వహణకు స్టేజ్ టూ ఆఫీసర్‌తో పాటు పోలింగ్ ఆఫీసర్లుగా ఇద్దరిని, మరో ఆరుగురు సిబ్బందిని నియమించారు. 18 వార్డు ఉప ఎన్నికల బరిలో నలుగురు అభ్యర్థులు పోటీలో ఉన్నారు. శనివారం మధ్యాహ్నం రెండు గంటల వరకూ పోలింగ్ జరుగుతుంది. భోజన విరామం తరువాత కౌటింగ్ ప్రక్రియ పూర్తవుతుందని ఎంపీడీఓ రఘునాథగుప్తా తెలిపారు.

నేడు చలివెందుల సర్పంచ్ ఎన్నిక

హిందూపురం అర్బన్: చలివెందుల సర్పంచ్ ఉప ఎన్నిక శనివారం జరగనుంది. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గ్రామంలోని పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. సర్పంచ్ స్థానానికి వైఎస్సార్‌సీబలపరచిన అభ్యర్థి ఉపేంద్రరెడ్డి, తెలుగుదేశం బలపరచిన అభ్యర్థి రవీంద్రారెడ్డి పోటీలో ఉన్నారు. మొత్తం 2514 ఓటర్ల ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు ఓట్ల లెక్కింపు ముగియగానే అక్కడే ఫలితాలు ప్రకటిస్తారు. ఎన్నిక ప్రశాంతగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ కంజక్షన్ తెలిపారు.

పులమతిలో 10వ వార్డు ఉప ఎన్నిక పోలింగ్

లేపాక్షి: మండలంలోని పులమతి గ్రామ పంచాయతీలో శనివారం ఉదయం 10 వార్డు ఉప ఎన్నిక పోలింగ్ జరుగనుందని ఈఓఆర్డీ శివన్న శుక్రవారం తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి 1 గంట వరకు పోలింగ్ జరుగుతుందని, మధ్యాహ్నం 2 గంటల నుండి 5 గంటల వరకు కౌంటింగ్ ఉంటుందన్నారు. పులమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ ఉంటుందన్నారు.

కార్మిక హక్కుల సాధనకు పోరాటం

సోమందేపల్లి: దేశంలో రైతులు, కార్మికుల హక్కుల సాధనకు రాజీలేని పోరాటం చేస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ తెలిపారు. బస్సు యాత్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న ఎన్‌డీఏ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. నిత్యావసర, చమురు, ధరలు పెంచి కేంద్ర ప్రభుత్వం నిలువు దోపిడీ చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు శ్రీరాములు, వినోద్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులపై వివక్ష చూపొద్దు

పావగడ: దివ్యాంగుల పట్ల వివక్ష చూపొద్దని బెంగళూరు కు చెందిన సృష్టి అకాడమీ ప్రిన్సిపాల్ ఉమాపతి సూచించారు. స్థానిక స్వామి వివేకానంద దివ్యాంగుల సంఘం ఆవరణలో శుక్రవారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా 25 మంది వివిధ దివ్యాంగ పిల్లలు హాజరయ్యారు. అంగవైకల్యంతో తీవ్రంగా బాధపడుతున్న పిల్లలను ఎలా శుశ్రూష చేయాలో తల్లితండ్రులకు శిక్షణ ఇచ్చారు. శిక్షకురాలు అనసూయమ్మ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారుల సమస్య పరిష్కరించండి

పావగడ: శనిమహాత్మ ఆలయం వద్ద టెంకాయలు, పూజా సామగ్రి అమ్ముకునే వ్యాపారుల సమస్య తీర్చాలని స్థానిక వీధి వ్యాపారుల సంఘం అధ్యక్షుడు గేట్ కుమార్ ఎస్ఎస్‌కే సంఘం అధ్యక్షుడు ఆనందరావును కోరారు. స్థానిక శనిమహాత్మ ఆలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టెంకాయల వ్యాపారం ఆధారంగా బతుకుతున్న వ్యాపారులు టెంకాయలు అమ్ముడు పోక పోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎస్ఎస్‌కే సంఘం అధ్యక్షుడు ఆనందరావు మాట్లాడుతూ టెంకాయలు, పూజా సామగ్రి ధరలు బోర్డు మీద ప్రకటించాలని టెంకాయ వ్యాపారులకు సూచించారు. ఇదిలా ఉండగా కొన్నేళ్లుగా ఆలయం వద్ద టెంకాయలు అమ్మనివ్వకుండా ఆలయ సమితి పదాధికారులు అడ్డుపడుతున్నారు. ఆలయంలో టెంకాయ సేవలు రద్దు చేశామని, భక్తులు టెంకాయలు ఆలయం లోపలికి తీసుకు రాకూడదని మైకులో ప్రకటిస్తున్నారు.